క్లుప్తంగా

ఇతర మతాలను గౌరవించాలి

రఘునాథపల్లి : సొంత మతాచారాలు పాటిస్తూ, ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రఘునాథపల్లి సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని రఘునాథపల్లి, చిల్పూర్, లింగాలఘణపురం మండలాలకు చెందిన వివిధ మతాల పెద్దలతో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత సామరస్యం పరిఢవిల్లేలా పండుగల వేళ సోదర భావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు నరేష్‌కుమార్, శ్రవణ్‌కుమార్, నాజర్, మత పెద్దలు పాల్గొన్నారు.

చిందు కళల సంస్కృతిలో ఆధ్యాత్మికత

దేవరుప్పుల : ఊరూరా ఎండాకాలంలో చిందు కళాకారుల సంస్కృతిలో ఆధ్యాత్మికత వెల్లడయ్యే ఎల్లమ్మ వేషధారణతో ఆధ్యాత్మికత వాతావరణం నెలకొనడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం మండలంలోని కామారెడ్డి గూడెంలో దళితవాడలో చిందుకళాకారులు తమ ఆటలు ముగిసే చివరి రోజు ఎల్లమ్మ తల్లి వేషధారణతో ఇంటింటా తిరిగి భక్తులకు ఆశీర్వచనం అందించారు. భక్తులు సైతం చిందు కళాకారులకు ఇనామ్‌లు ఇస్తూ తమ దాతృత్వాన్ని ప్రకటించుకున్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం మధ్య ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంను అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న పాల్గొన్నారు.


భగవాన్‌సింగ్‌కు డాన్ బ్లాక్ బెల్ట్ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న భగవాన్‌సింగ్, రవి

జఫర్‌గఢ్ : మండల కేంద్రానికి చెందిన ఠాకూర్ భగవాన్‌సింగ్ జపాన్ కరాటే అసోసియేషన్ అంతర్జాతీయ 2వ డాన్ బ్లాక్ బెల్ట్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో (జేకేఏ) ప్రధాన డోజోలో బ్లాక్ బెల్ట్ డాన్ గ్రేడింగ్ పరీక్షల్లో ఠాకూర్ భగవాన్‌సింగ్‌తో పాటు 26 రాష్ట్రాలకు చెందిన జేకేఏ మాస్టర్స్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో భగవాన్‌సింగ్ తన ప్రతిభ కనబర్చి డాన్ బ్లాక్ బెల్ట్ పురస్కారాన్ని అందుకున్నాడు. ఈయనతో పాటు కొయ్యడ రవి కూడా బ్లాక్‌బెల్ట్ సాధించాడు. వీరికి జేకేఏ ఇండియా ప్రధాన శిక్షకులు శిహాన్ ఆనంద్ రత్నసెన్సెయి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన శిక్షకులు శిహాన్ రాపోలు సుదర్శన్ సెన్సెయి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. భగవాన్ సింగ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పాఠశాలలకు యూనిఫామ్‌లు సిద్ధం



ఎంఈఓకు దుస్తులు అప్పగిస్తున్న ఎంపీడీఓ, ఏపీఎం, సీసీలు

రఘునాథపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా సంవత్సరం పునఃప్రారంభమయ్యే ముందే యూనిఫామ్‌లు సిద్ధం అయినట్లు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. దుస్తులు కుట్టే బాధ్యతను చేపట్టిన స్వయం సహాయక సంఘం సభ్యులు విద్యార్థులందరికీ ఒక్కో జత కుట్టి మంగళవారం ఎంపీడీఓతో కలిసి ఐకేపీ కార్యాలయంలో ఎంఈఓ రఘునందన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 62 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1278 మంది బాలురు, 1409 మంది బాలికలకు నవ భారతి మండల సమాఖ్య టైలరింగ్ హబ్ ద్వారా సకాలంలో దుస్తులు సిద్ధం చేశారన్నారు. ఏపీఎం సారయ్య, సీసీలు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో తాగునీటికి కటకట

- మున్సిపాలిటీ అయినా మారని తీరు
- నల్లాల ద్వారా వారం రోజులుగా రాని తాగునీరు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు



ఎస్సీ కాలనీలో ఓ ప్రైవేట్ బోరు వద్ద మహిళల పాట్లు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లిలోని పలు వార్డుల్లో వారం రోజులుగా నల్లాల ద్వారా నీరు రావడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా మారినా నీటి తిప్పలు తప్పడం లేదు. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలోనే నీటి సరఫరా సజావుగా ఉండేదని పలువురు అంటున్నారు. వారం రోజుల క్రితం స్టేషన్‌ఘన్‌పూర్‌లో మిషన్‌భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. అప్పటి నుంచి మిషన్ భగీరథ, మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు నీటి తిప్పలు తప్పడం లేదు. కనీసం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద నుంచి బోర్ల ద్వారా బిందెలు, బకెట్లతో నీరు ఎత్తుకొస్తున్నామని, మున్సిపాలిటీ అయినా నీటి తిప్పలు తప్పడం లేదని మహిళలు ఆవేదన చెందుతున్నారు. వర్షాకాలంలో సైతం నీటి సమస్య తప్పడం లేదని, సంబధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



దేవరుప్పులలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల : గిరిజనుల అభ్యున్నతి కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమైందని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం తండా బాట కార్యక్రమంలో భాగంగా ధర్మగడ్డ, పడమటి తండాల్లో పర్యటించి పార్టీ శ్రేణులతో జరుగబోయే ఎన్నికలపై సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ పరిపాలనలోనే దేశంలో లంబాడీ, గిరిజనులకు సముచిత రిజర్వేషన్ కల్పన చేయడం వల్లనే పలు రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ఆర్భాటాలు, హంగామాలకు తావివ్వకుండా ఇంటింటా కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్న తీరుపై ప్రజలు ఆలోచించాలన్నారు. అనంతరం మండల పార్టీ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యూహాత్మకంగా సన్నద్ధం కావాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, డెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, సీనియర్ నాయకులు సురేష్‌బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి పాండు కృష్ణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్ మండల అధ్యక్షులు నాగరాజు, సజ్జన్, గణేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు గులాం రసూల్, దశరథం, భాస్కర్, యాకస్వామి,జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్యాచారయత్నం కేసు నమోదు

నర్మెట : మండల కేంద్రానికి చెందిన యువకుడు ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేయబోగా పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నైనాల నగేష్ కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం అమ్మమ్మ ఇంటికి వచ్చిన మైనర్ బాలిక నిద్రిస్తుండగా అదే రాత్రి ఇంట్లోకి వచ్చిన యువకుడు నోరు మూసి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అదే ఇంట్లో నిద్రపోతున్న అమ్మమ్మ బాలిక అరుపులతో నిద్రలేచి రావడంతో యువకుడు పరారయ్యాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ఆవులు తరలిస్తున్న ముగ్గురిపై..

రఘునాథపల్లి: బక్రీద్ పండుగను పురస్కరించుకొని హైదారాబాద్ కబేళాకు ఆవులను తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. లింగాలఘణపురం మండలం వడిచర్ల గ్రామానికి చెందిన ఎండీ.మసూక్, ఎండీ.సాబీర్, కొంగరి రాములు బొలెరో క్యాంపర్ వాహనంలో బానాజీపేట మీదుగా అనుమానాస్పద స్థితిలో వెళ్తూ పోలీసులకు కనబడ్డారు. వాహనం తనిఖీ చేయగా ఒక దానిపై ఒకటి కట్టేసి ఉన్న నాలుగు ఆవులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



గణేష్(ఫైల్)

పాలకుర్తి టౌన్: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి బాదావత్ గణేశ్(25) ఆత్మహత్య యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలో ని కొండాపురం శివారు మేకల తండాకు చెందిన బాదావత్ గణేష్‌కు 9 నెలల క్రితం మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన యువతితో వివాహం జరిగింది. భార్య అన్నపూర్ణను తల్లిగారింటికి పంపించపోవడంతో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన గణేశ్ ఆదివారం రాత్రి ఇంటి వద్ద పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడు తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

లింగాలఘణపురం : మండలంలోని పటేల్‌గూడేనికి చెందిన దేవరాయ రాంచంద్రయ్యకు చెందిన పాడి ఆవు మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రెండు ఆవులు కొట్లాడుకుంటూ ఎస్ఎస్–35 నంబర్ గల ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు రావడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఒక ఆవు చనిపోయింది. ఆర్థికసాయం అందించాలని రైతు రాంచంద్రయ్య వేడుకుంటున్నాడు.

అప్పిరెడ్డిపల్లిలో పాడి గేదె..

దేవరుప్పుల : మేతమేస్తూ విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన అప్పిరెడ్డిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో బొశెట్టి లలిత తన పాడిగేదెను మేతకు వదిలేసింది. సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సపోర్టుగా ఉండే వైరుకు ఇన్సులేటర్లు లేకపోవడంతో విద్యుత్ సరఫరా అయింది. మూగజీవి మేత మేస్తూ వచ్చి తాకడంతో మృతి చెందింది. సుమారు రూ. 80 వేల నష్టం వాటిల్లినట్టు రైతు లలిత వాపోయింది.

సంక్షిప్త సమాచారం

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, గ్రామ పెద్దలు

రఘునాథపల్లి : మండలంలోని కంచనపల్లిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారం, కందుకూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మాజీ సర్పంచ్ గవ్వాని విజయనాగేశ్వర్‌రావు ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన వారికి నిపుణులైన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని హైదరాబాద్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నానాజీ, ప్రభాకర్, జోసఫ్, ఏలియా, తిరుమల్‌రెడ్డి, ప్యారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

లచ్చునాయక్ సేవలు మరువలేనివి

దేవరుప్పుల : గత కొద్ది మాసాల్లోనైనా సమూల మార్పులు తెస్తూ విధులు నిర్వర్తించిన నాయబ్ తహసీల్దార్ లచ్చునాయక్ సేవలు మరువలేనివని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయిప్రకాశ్ అన్నారు. ఇక్కడ పనిచేసే క్రమంలో కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లగా ఆయనను సన్మానించారు. ఈయన వెంట పత్తేపురం శేఖర్, రంజిత్, ఉపేందర్ ఉన్నారు.

భూమి పాస్ బుక్కులు ఇవ్వండి

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలోని నా వ్యవసాయ భూమికి పట్టేదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని తప్పట్ల పోచయ్య కోరుతున్నాడు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నె గ్రామంలో సేద్యం చేసుకుంటున్న 8 ఎకరాల భూమికి గత 16 ఏళ్లుగా పట్టేదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. అధికారులు చొరవ తీసుకొని పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతున్నాడు.

అంధకారంలో నష్కల్ జాతీయ రహదారి



నష్కల్‌లోని గ్రామ బస్‌స్టేజీ వద్ద అంధకారం

చిల్పూరు: నష్కల్ గ్రామ బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై మూడు రోజులుగా విద్యుత్ దీపాలు వెలుగక పోవడంతో వాహన చోదకులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిలోని విద్యుత్ దీపాలను ఎల్‌అండ్‌టీ వారు ప్రతీ రోజు సాయంత్రం ఆన్ చేసి ఉదయం బంద్ చేసే వారని మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న వెంకటేష్ తెలిపారు. మూడు రోజుల నుంచి వీధిలైట్లు వేసే బాక్స్‌కు తాళం వేసి వెళ్లారని, లైట్లు వేయడం లేదని నిర్వాహకులను అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. గ్రామంలో బొడ్రాయి పండగ ఉండడంతో వచ్చే చుట్టాలు స్టేజీపై రాత్రి సమయంలో బస్ దిగితే చీకటితో ఇబ్బంది పడుతున్నారన్నారు.

కాంగ్రెస్ హయాంలో పేదలకు న్యాయం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు న్యాయం జరుగుతుందని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసకుటుంటున్నామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల పేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం ద్వారా పేదల ఇంటి కల నెరవేరుతోందని , ఇల్లు కేవలం నివాస స్థలం మాత్రమే కాదు, అది ఒక కుటుంబానికి భద్రత, గౌరవం, భవిష్యత్ ప్రతి లబ్ధిదారుడి జీవితంలో ఇది కొత్త ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర చారి, ఎంపీడీఓ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు గిరగాని కుమార స్వామి, శ్రీనివాస్, యాకాతరావు, ఎండీ మదార్, ఆదినారాయణ, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

జఫర్‌గఢ్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆర్డీఓ వెంకన్న తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇళ్ల లబ్ధిదారుల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులను ఇప్పటికే ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 5న ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందజేస్తారని వివరించారు. హౌజింగ్ పీడీ మాత్రునాయక్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీఓ సుమన్, వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ

కొడకండ్ల : మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తెలిపారు. ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పంపిణీ చేస్తున్నందున లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

నర్మెట : కాంగ్రెస్ పాలనలోనే బడుగు బలహీన వర్గాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అన్నారు. కన్నెబోయినగూడెంలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్‌తో కలిసి ఇళ్ల మంజూరీ పత్రాలను పంపిణీ చేశారు. ఇందులో ఐదుగురు ఎస్సీలకు, నలుగురు ఎస్టీలకు, ఎనిమిది మంది బీసీలకు మంజూరు పత్రాలను అందజేశారు.

'ఇందిరమ్మ ఇళ్ల కోసం లంచాలు ఇవ్వొద్దు'

స్టేషన్‌ఘన్‌పూర్ : ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎవరూ దళారులను ఆశ్రయించి లంచాలు ఇవ్వవద్దని, ఏమైనా సమస్యలుంటే నేరుగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా దృష్టికి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. ఘన్‌పూర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో కొందరు నాయకులు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. ఎవరైనా సంక్షేమ పథకాల పేరిట వసూళ్లకు పాల్పడితే నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని, అవసరమైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

కాలుష్యనియంత్రణ మండలి సభ్యుడిని కలిసిన పృథ్వీ

స్టేషన్‌ఘన్‌పూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర కాలుష్య మండలి అప్పిలేట్ అథారిటీ సభ్యుడిగా నియమించిన కాకతీయ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్‌ను మంగళవారం వారి నివాసంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పృథ్వీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దయాకర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గురుకులాల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

జనగామ రూరల్ : సోషల్ వెల్ఫేర్ గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గంధమల్ల ఉదయ్ కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంతోష్, నవీన్, ప్రభాస్, కిషోర్, అనిల్ కుమార్, రవీందర్, సురేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనంతోనే లాభసాటి వ్యవసాయం



లింగంపల్లి రైతు వేదిక వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న పద్మజ

చిల్పూరు: నాణ్యమైన విత్తనంతోనే రైతుకు లాభసాటి వ్యవసాయం ఉంటుందని వరంగల్ ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ అన్నారు. లింగంపల్లిలోని రైతు వేదికలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, చిల్పూరు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం..లాభసాటి వ్యవసాయానికి సోపానం కార్యక్రమంలో భాగంగా మండలం నుంచి ఎంపిక చేసిన 36 మంది రైతులకు నాణ్యమైన విత్తనాలపై మండల వ్యవసాయాధికారి నజీరొద్దీన్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నాణ్యమైన విత్తనం అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యం, తదుపరి పంట సీజన్‌కు అదే గ్రామంలో ఉండే రైతులకు అమ్మే విధంగా ఎంపిక చేసిన రైతులకు వరిరకం డబ్ల్యుజీఎల్ –962, పెసర్లు ఎంజీజీ–385 పంపిణీ చేశారు. వ్యవసాయ విస్తరణాధికారులు వినయ్‌కుమార్, యాకూబ్, నర్సింహులు, అఖిల పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అన్నదాత చేతుల్లోనే విత్తనాల ప్రక్రియ

దేవరుప్పుల : నకిలీ విత్తనాల బెడద నివారణ కోసం నాణ్యమైన విత్తనోత్పత్తి ప్రక్రియ అన్నదాత చేతుల్లోనే ఉందని మండల వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య అన్నారు. మంగళవారం మండలంలోని నీర్మాల రైతు వేదికలో ఊరూరా నాణ్యమైన విత్తనాల తయారీ కోసం సరఫరా చేసిన వరి, పెసర విత్తనాల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు.

నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దు

నర్మెట : రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయొద్దని, సాగులో మెళకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ మనోహిత్ విక్రం అన్నారు. రైతు వేదికలో మంగళవారం రైతులకు వరంగల్ 962 ఎఫ్–1 సన్నరకం వరి విత్తనాలను 16 మందికి రైతులకు మంగళవారం పంపిణీ చేశారు.

కొబ్బరి ముక్కల వేలం రూ.1.70 లక్షలు



వేలం పాటలను నిర్వహిస్తున్న ఈఓ వంశీ

బచ్చన్నపేట : మండలంలోని కొడవటూర్ స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో వివిధ హక్కులకు వేలం పాటలను నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. మంగళవారం వేలం పాటలను నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ కొబ్బరి ముక్కల వేలం రూ. 1.70 లక్షలకు పాడి అమరేశ్వర్ పాటను దక్కించుకున్నారన్నారు. ఈ వేలం కాల పరిమితి ఒక ఏడాది మాత్రమే ఉంటుందన్నారు. టెంకాయలు, పూజాసామగ్రి అమ్ముట, స్వామి వారి లడ్డూ, పులిహోర, తలనీలాలు పోగుచేసుకొనుట హక్కులకు సరైన వేలం పాట రానందున వాయిదా వేస్తున్నామని తెలిపారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పర్యవేక్షకులుగా హాజరు కాగా ఆలయ కమిటీ చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ఆలయ ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, మహాశివుడు, సదాశివుడు పాల్గొన్నారు.

'భూ భారతి'ని సద్వినియోగం చేసుకోండి

సాక్షి, నెట్‌వర్క్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోహిత్ సింగ్, ఏమానాయక్, సుహాసిని, ఆర్డీఓలు వెంకన్న, గోపిరామ్ అన్నారు. నర్మెట, జఫర్‌గఢ్, రఘునా థపల్లి, బచ్చన్నపేట, లింగాలఘణపురం, దేవ రుప్పుల, తరిగొప్పుల, చిల్పూరు, కొడకండ్ల మండలాల్లోని ఆయా గ్రామల్లో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సును సందర్శించిన ఆయన అధికారుల నుంచి వివరాలు తెలుసుకోవడంతో పాటు రైతులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు అని తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలకు సంబంధించి తగిన ఆధారాలతో గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని క్షేత్రస్థాయిలో పరి శీలించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులో చేసుకున్న భూ సమస్యల దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేస్తామన్నారు. దానికి సంబందించిన ఓ పత్రాన్ని దరఖాస్తు దారునికి కూడా అందిస్తామన్నారు. కార్యక్రమాల్లో తహ సీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



రఘునాథపల్లి : తహసీల్దార్‌కు సూచనలు ఇస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని



లింగాలఘణపురం : నాగారంలో దరఖాస్తుల తీరును పరిశీలిస్తున్న ఆర్డీఓ గోపీరామ్



దేవరుప్పుల : గొల్లపల్లిలో భూభారతి సదస్సులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అండాలు

సర్వీస్ రోడ్లపై ఇష్టారాజ్యంగా పార్కింగ్



సర్వీస్ రోడ్డుపై నిలిపిన వాహనాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ కేంద్రంలో గాంధీ చౌరస్తా నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు, జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్లపై పలువురు ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా స్థానిక గాంధీ చౌరస్తా నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు సర్వీసు రోడ్ల వెంట పలు దుకాణాల ఎదుట ఆటోలు, ట్రాలీలు, కార్లు తదితర వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. దాంతో ఆ దారి వెంట వెళ్లే ఇతర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ విషయమై స్థానిక పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, సర్వీసు రోడ్ల వెంట అడ్డందిడ్డంగా వాహనాల పార్కింగ్‌ను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.